క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



ఆగిరిపల్లి: గొండపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీనివాసరావుని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీనివాసరావు తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పలగాని నరసింహారావు శ్రీనివాసరావుని పరామర్శించి ఆయన తల్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కందుల విక్రం, నాయకులు బెజవాడ శ్రీహర్ష, పామర్తి శివ పాల్గొన్నారు.

20న ఆలయ ప్రాంగణంలో షాపులకు వేలం

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని ఆలయానికి చెందిన షాపులకు ఈనెల 20న వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజ ద్రవ్యాలు, ఆట వస్తువులు, బొమ్మలు, ఫ్యాన్సీ తదితర వ్యాపారాలు చేసుకునే లైసెన్స్ హక్కుతో పాటు భక్తులు సమర్పించిన వస్త్రాలు, పాలు, బియ్యం, అపరాలు వసూలు చేసుకునే హక్కునకు, తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు, వాహనాల పార్కింగ్‌కు వేలం జరుగుతుందని చెప్పారు. 20న ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణ్ అన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద బండికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సక్రమంగా రికార్డులు లేనివారు, హెల్మెట్ ధరించని వాహనదారులకు అవగాహన కల్పించారు. కొంతమందికి జరిమానాలు విధించారు. వాహన చోదకులు బండి రికార్డులను దగ్గర ఉంచుకోవాలన్నారు. మొదటి సారిగా అవగాహన కల్పిస్తున్నామని, మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

మేరీమాత విగ్రహం ఊరేగింపు



జగన్నాథపురం(వీరులపాడు): సమస్త జనుల పాప పరిహారార్థం ప్రభువైన ఏసు క్రీస్తు సిలువపై రక్తాన్ని చిందించి తిరిగి పునరుద్దానుడై లేచాడని వరంగల్ మేత్రాసన బిషప్ ఉడుముల బాల అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో నిత్య సహాయ మాత ఆలయ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం దివ్యబలి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన బిడ్డలను రక్షించేందుకే పరలోక మహిమతో భూమిపైకి వచ్చాడన్నారు. ప్రతి ఒక్కరు తోటి వారిపై ప్రేమ, దయ, జాలితో పాటు సేవా భావంతో నడుచుకోవాలని సూచించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. విచారణ గురువు సుగుణరావు, సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు బాలస్వామి, నరసింహారెడ్డి, జ్ఞానారెడ్డి, చిన్నపరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకీ అవస్థలే

- అస్తవ్యస్తంగా శ్మశాన వాటికలు
- కనీస మౌలిక వసతులు లేక ఇక్కట్లు
- తప్పని పరిస్థితుల్లో వాగులు, వంకలు దాటి కర్మ.కాండలు
- చప్టాల నిర్మాణంపై నీటి మూటలుగా ఎమ్మెల్యే వసంత హామీలు



జి.కొండూరు హిందూ శ్మశాన వాటికకు మృతదేహంతో పులివాగులో నుంచి వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

జి.కొండూరు: ఎన్ని ప్రభుత్వాల మారినా, ప్రజా ప్రతినిధులు ఎన్ని హామీలు ఇచ్చినా శ్మశాన వాటికల తీరు మాత్రం మారడంలేదు. కనీస మౌలిక వసతులు లేక మృతదేహాలను తీసుకుని శ్మశాన వాటికలకు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందుల వర్ణనాతీతం. జి.కొండూరు హిందూ, కందులపాడు ఎస్సీ శ్మశాన వాటికలకు వెళ్లేందుకు దారిలేదు. వాగులలో చప్టాల నిర్మాణంపై ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి.

వాగులు దాటి కర్మకాండలు

జి.కొండూరు మండల పరిధి కందులపాడులో ఎస్సీ కాలనీలో ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించేందుకు బాధిత కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కందులపాడు గ్రామం బుడమేరు వాగుకి ఎడమ వైపున ఉండగా కుడి వైపు ఎస్సీ శ్మశాన వాటిక ఉంది. అది కూడా అధికారికంగా కేటాయించిన స్థలం కాకపోవడంతో బుడమేరు వాగు స్థలంలోనే కర్మకాండలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో వరదలు వచ్చిన సమయంలో ఎవరైనా మరణిస్తే ఇక బాధిత కుటుంబ సభ్యులకు చుక్కలు కనపడినట్లే. మృతదేహాన్ని ఎత్తుకొని వాగు దాటేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆ గ్రామ ప్రజలు చేసే ఫీట్లు చూపరులను భయభ్రాంతులకు గురిచేస్తాయి. జి.కొండూరు హిందూ శ్మశాన వాటికలో కూడా మృతుల కుటుంబాలకు ఇక్కట్లు తప్పడంలేదు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లేక గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. గ్రామంలో హిందువులు ఎవరైనా మృతి చెందితే పులివాగులో నుంచి శ్మశాన వాటికకు వెళ్లాల్సి ఉంది. వాగులో వరద ప్రవాహం కొనసాగినప్పుడు ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించడం ఆ బాధిత కుటుంబానికి నరకయాతనగా మారుతోంది.

అమలుకు నోచుకోని ఎమ్మెల్యే వసంత హామీలు

జి.కొండూరు హిందూ శ్మశాన వాటికకు వెళ్లేందుకు పులివాగులో, కందులపాడు ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లేందుకు బుడమేరు వాగులో చప్టాలను నిర్మిస్తామని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. జి.కొండూరు ఎస్సీ శ్మశాన వాటిక సైతం అభివృద్ధికి నోచుకోక డంపింగ్ యార్డులా దర్శనమిస్తోంది. మైలవరం నియోజకవర్గంలో 150కి పైగా శ్మశాన వాటికలు ఉంటే 90 శాతానికి పైగా శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోక ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు.

వర్ధంతులు నిర్వహించడం కష్టమే

శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల మృతులు కుటుంబ సభ్యులు వర్ధంతులు నిర్వహించినప్పుడు సమాధుల వద్దకు వెళ్లేందుకు కూడా వీలు లేక ఇబ్బంది పడుతున్నారు. శ్మశాన వాటికలకు వెళ్లేందుకు వాగులు దాటాల్సి వచ్చి కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతుంటే శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోక ముళ్ల పొదలతో నిండిపోయి, ప్రహరీలు లేక, తాగునీరు సౌకర్యం లేక, కర్మకాండలు నిర్వహించుకునేందుకు షెడ్లు లేక కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో నామమాత్రంగా ముళ్ల పొదలు తొలగించి వదిలేయడంతో శ్మశాన వాటికలు మళ్లీ అటవీ ప్రాంతాలను తలపిస్తున్నాయి.



డంపింగ్ యార్డులా మారుతున్న జి.కొండూరు ఎస్సీ శ్మశాన వాటిక

హద్దులు ఏర్పాటు చేయాలి



జి.కొండూరు హిందూ శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలి. పులివాగుపై చప్టా నిర్మాణం చేపట్టాలి. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించాలి. ప్రహరీ, షెడ్డును ఏర్పాటు చేయాలి. ఎన్ని ప్రభుత్వాలు మారినా శ్మశాన వాటిక అభివృద్ధి జరగడం లేదు.

– దారా నర్సింహారావు, గ్రామస్తుడు, జి.కొండూరు

డంపింగ్ యార్డులా మారుతోంది



జి.కొండూరు ఎస్సీ శ్మశాన వాటిక డంపింగ్ యార్డులా మారుతోంది. గ్రామంలోని వ్యర్థాలను శ్మశాన వాటికలో పడేస్తున్నారు. ముళ్ల పొదలతో నిండి ఉండటంతో ఎవరైనా మరణించినప్పుడు గానీ వర్ధంతులకు గాని శ్మశాన వాటికలోకి వెళ్లే పరిస్థితి లేదు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి.

– బట్టపర్తి రాజు, గ్రామస్తుడు, జి.కొండూరు

రహదారి భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్

నూజివీడు: వాహన చోదకులు నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని నూజివీడు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి జి.నాగమురళి అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని, వారు నడిపేటప్పుడు ప్రమాదాలు సంభవిస్తే వాహనం ఎవరిదైతే వారికి కూడా శిక్ష పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారుల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రయాణాలు చేసేటప్పుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరేందుకు పరిమిత వేగంతో, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



తిరువూరులోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు



ఇబ్రహీంపట్నంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏఓ శైలజ

తిరువూరు: తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఏడీఏ శ్రీనివాసరావు, తిరువూరు, ఎ.కొండూరు మండలాల వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్ పది దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఓ ఫారం లేని రూ.9 లక్షల 52 వేల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపి వేయాలని ముగ్గురు డీలర్లను ఆదేశించారు. వెంటనే ఈ ఎరువులకు సంబంధించిన అనుమతి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని, లేకుంటే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ఏరోజు అమ్మిన స్టాకు ఆరోజు ఈపోస్‌లో, స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని చెప్పారు. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువులకు తప్పక బిల్లు పొందాలని సూచించారు.

- ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. నంది గామ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఐకే శ్రీనివాసరావు ఎరువుల దుకాణాల్లో రికార్డులు తనిఖీ చేశారు. కొన్ని దుకాణాల్లో 'ఓ' ఫారం గడువు దాటిపోవడం, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, సరైన సమయాల్లో స్టాక్ ఎకనాలెడ్జ్ చేయకపోవడం వంటి లోపాలు గుర్తించారు. లోపాలు సరిచేసుకునే వరకు ఎరువుల అమ్మకాలు కొనసాగించవద్దని ఆదేశించారు. మండల వ్యాప్తంగా రూ.2.14 లక్షల విలువైన ఎరువులు అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి డి.శైలజ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలను పరిశీలించి మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, సీఐ చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులపై కొండపల్లి మున్సిపల్, పోలీస్ అధికారులు శుక్రవారం రాత్రి చర్యలు చేపట్టారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని 65వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పడిన రద్దీ, ట్రాఫిక్ ఇబ్బందులకు ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా ఓ కారణంగా వారు గుర్తించారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఐ ఎ.చంద్రశేఖర్ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపునకు ముందుకు రావడంతో రెండు రోజులు గడువు ఇవ్వాలని చిరు వ్యాపారులు కోరారు. దీంతో రెండు రోజులు గడువు ఇచ్చారు. సోమవారం లోపు ఆక్రమణలు తొలగించకుంటే మేమే తొలగిస్తామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

9 గంటలు విద్యుత్ ఇవ్వాలని డిమాండ్



చిల్లబోయినపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ముసునూరు: మా పంటలు ఎండుతున్నాయి.. మా బతుకులూ ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని చిల్లబోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం రైతులు ధర్నా నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ నీరందక వెన్నుతీత దశలో ఉన్న మొక్కజొన్న పంట ఎండిపోతోందని చెప్పారు. మండలంలోని చిల్లబోయినపల్లి సబ్‌స్టేషన్‌లో వందలాది మోటార్ల నీటి ఆధారంతో 1,600 ఎకరాల్లో సన్నకారు, చిన్నకారు రైతులు మొక్కజొన్న, పొగాకు, ఆయిల్ పాం, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొమ్మిది గంటల పాటు పంటలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేవారని, ఏడు నెలల కిందట ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు పంటలకు నీటిని అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. తొమ్మిది గంటల విద్యుత్ ఇచ్చేంత వరకూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఏఈ వీరబాబు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏఈ ఉన్నతాధికారులతో మాట్లాడి పది రోజుల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. దీంతో ప్రస్తుతానికి రైతులు శాంతించినా, పరిస్థితిలో మార్పు రాకపోతే ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరించారు. ధర్నాలో రైతులు కొనకాల నాగేశ్వరరావు, సర్పంచ్ కండెపు రామగిరి, చిరంజీవి, చినబుజ్జి, ప్రసాద్, మొక్కపాటి లక్ష్మీ నారాయణ, అనగాని రంగారావు, మండలపు సాంబశివరావు, కోటేశు, అక్కినేని వెంకటేశ్వరరావు, రాజులపాటి రాంబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఆకుకూరలతో చక్కటి ఆరోగ్యం

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని ముండ్లపాడు అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పండించిన ఆకుకూరలను తల్లులకు అందజేశారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

తిరువూరు: జవహర్ నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష తిరువూరులో శనివారం జరుగుతుంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 131 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 240 మంది ఈ పరీక్షకు హాజరవుతారని ఎంఈఓ శ్యాంసుందర్ తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

మైలవరం: మైలవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నవోదయ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆర్‌వీ కృష్ణారావు తెలిపారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 312 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 10.45 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు.

సామాజిక పెన్షన్ల తనిఖీ



తిరువూరు: పట్టణంలోని పలు వార్డు సచివాలయాల పరిధిలో డయాలసిస్ రోగులకు మంజూరు చేసే పెన్షన్లను వైద్యాధికారులు తనిఖీ చేశారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రేష్మా బేగం ఆధ్వర్యంలో సిబ్బంది పలువురు పెన్షనుదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించారు. సచివాలయ కార్యదర్శులు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: ఈ నెల 20న దివ్యాంగుల పింఛన్ల తనిఖీ నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనంద్ బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20న మండలంలో మంచానికే పరిమితమై శాశ్వత వైకల్యంతో పింఛన్ పొందుతున్న వారి ఇంటికి వెళ్లి ప్రత్యేక వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించనున్నామని చెప్పారు.

తెల్లదోమ నివారణకు చర్యలు చేపట్టాలి : ఏడీఏ

కంచికచర్ల : మండలంలోని కొత్తపేట, గని ఆత్కూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటల సంరక్షణకు రైతులు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. పత్తిపంటకు తెల్లదోమలు ఆశించకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి పంటకు తెగులు ఆశించకుండా నీలి మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంచికచర్ల మండల వ్యవసాయాధికారి కె.విజయ్ కుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు సాహిత్య, రుచి, రైతులు పాల్గొన్నారు.

వెండి తాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి శుక్రవారం గ్రామానికి చెందిన రామిశెట్టి నాగేశ్వరరావు, రాజేశ్వరి దంపతులు, రామిశెట్టి సాంబశివరావు కుటుంబసభ్యులు రూ.30,116లు అందజేశారు. ఈమేరకు ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఆదరణకు నోచుకోని ఆర్ అండ్ బీ అతిథి గృహం

కార్ల స్టాండ్‌గా స్థానికులకు ఉపయోగం



మైలవరంలో ఆర్ అండ్ బీ అతిథి గృహం

మైలవరం: నాడు ఎందరో ప్రముఖులకు ఆశ్రయం కల్పించిన మైలవరం రహదారులు భవనాలు శాఖ విశ్రాంతి భవనం నేడు నిరాదరణకు గురై వెలవెలపోతోంది. నాడు వర్షా కాలంలో విజయవాడ నుంచి మైలవరం మీదుగా తిరువూరు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎంతో ప్రయాసతో కూడుకున్న ప్రయాణం. మైలవరం గ్రామ సమీపంలో అప్పట్లో కొండ వాగు, పులి వాగులు ఉధృతంగా ప్రవహించేవి. వాగుల ఉధృతికి బస్‌లు కూడా ప్రవాహంలో కొట్టుకుపోయేవి. వర్షాకాలంలో వాగుల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలను సందర్శించాలంటే రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా మైలవరం వరకు వచ్చి వెనుదిరిగే వారు. ప్రజలు కూడా వాగులపై వంతెనలు లేకపోవడంతో వాగులు దాటేందుకు భయపడేవారు.

గతంలో ప్రజాప్రతినిధులు, అధికారుల బస

ఈ నేపథ్యంలో మైలవరం నియోజకవర్గం నుంచి జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన చనమోలు వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలిచి రహదారులు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ సమస్యపై ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చించి మైలవరంలో ఆర్ అండ్ బీ అతిథి గృహాన్ని 1976లో శంకుస్థాపన చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఈ కార్యక్రమానికి అప్పటి రవాణా శాఖ మంత్రి చేబ్రోలు హనుమయ్య కూడా హాజరయ్యారు. వర్షాకాలంలో వాగుల తీవ్రత తగ్గే వరకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ ఆర్ అండ్ బీ అతిథి గృహంలోనే విశ్రాంతి తీసుకునేవారు.

వంతెనల ఏర్పాటుతో నిరాదరణ

అనంతరం మైలవరం తిరువూరు రోడ్డులోను, మైలవరం–నూజివీడు రోడ్డులోని వాగులపై వంతెనలు ఏర్పాటు చేయడంతో బస్‌లు, ఇతర వాహనాలు రాకపోకలు నిర్భయంగా జరుగుతున్నాయి. గతంలో పలువురు రాజకీయ ప్రముఖులు, మంత్రులు బస చేసిన ఈ ఆర్ అండ్ బీ అతిథి గృహం నిరాదరణకు గురై నేడు ఎలాతెలా పోతుంది. ప్రస్తుతం కొత్త పార్టీలు ఆవిర్భవించి స్థానికంగానే ఆ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆర్ అండ్ బీ అతిథిగృహాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. స్థానికులకు కార్ల స్టాండ్‌గా ఇది ఉపయోగపడుతోంది.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నూజివీడు: రైతు ఉద్యమ నేత దల్లేవాల్ 53 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఈ నెల 26న ట్రాక్టర్ల ర్యాలీ చేయాలని నిర్ణయించామని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా పార్లమెంటు సభ్యుల ఇళ్ల ముందు మోదీ అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నాలు చేస్తామన్నారు. మోదీ రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేశారని హరినాథ్ విమర్శించారు. ఎన్డీఏ భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల కోసం మోదీపై ఒత్తిడి తేవాలని కోరారు. వ్యవసాయ భూములను పరిశ్రమలకు కట్టబెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపయోగంగా ఉన్న సెజ్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని కోరారు. రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సీ2 ప్లస్ 50 శాతం మద్దతు ధర ఇవ్వాలని, రైతాంగ రుణ మాఫీ చట్టం చేయాలని, 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, 60 సంవత్సరాలు పైబడిన రైతుకు పది వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని హరినాథ్ డిమాండ్ చేశారు.

కేసు దర్యాప్తునకు ప్రత్యేకాధికారి నియామకం

చందర్లపాడు: చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన నల్లాని వీరమణితేజ పోస్టుమార్టం ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించాలని అతని కుటుంబసభ్యులు పట్టుబట్టడంతో శుక్రవారం ఉదయం విజయవాడలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులు, మిత్రుల అశ్రునయనాల నడుమ ముప్పాళ్లలో వీరమణితేజ అంత్యక్రియలు పూర్తయ్యాయి. వీరమణితేజ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేయడంతోపాటు హత్యకోణంలోనే విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తుకు వీరులపాడు ఎస్ఐ అనిల్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడంతో వీరమణితేజ మృతికి ముందు అతనితో ఉన్నవారిని, అంబులెన్స్ డ్రైవర్‌ను విచారిస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా రెండు వాహనాలు ఢీకొనటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పినట్లు అంబులెన్స్ డ్రైవర్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పోస్టుమార్టం రిపోర్టు వస్తేకాని హత్య జరిగిందా? లేదా? అనేది నిర్ధారణ అవుతుంది.